సాక్షి
మెదక్
ఆదివారం । 19 । జనవరి । 2025



67.45 శాతం హాజరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వివరాలు 8లో ▸



దొంగల బీభత్సం

జిల్లాలో పలుచోట్ల దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. వివరాలు 8లో ▸



ఉత్సవాలకు వేళాయే

నేటి నుంచి చాముండేశ్వరీ అమ్మవారు ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగనున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ సాయికుమార్, లైన్‌మెన్ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కౌడిపల్లి, దేవులపల్లి, మహమ్మద్‌నగర్, కన్నారం, సదాశివపల్లి, పాంపల్లి, ధర్మాసాగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగు భూములకే ‘రైతు భరోసా’



శివ్వాయపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ వినయ్

రామాయంపేట(మెదక్)/నిజాంపేట: సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ తెలిపారు. శనివారం మండలంలోని శివ్వాయపల్లిలో సర్వే తీరును పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా అందే అవకాశం ఉందని, ఈనెల 20 వరకు గ్రామాల్లో సర్వే కొనసాగుతుందని వివరించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జి సహాయ సంచాలకులు రాజ్ నారాయణ, రెవెన్యూ అధికారులు ఉన్నా రు. అలాగే నిజాంపేట మండలంలోని నగరంలో రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ఈస ందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మహాసభలకు తరలిరండి

మెదక్ కలెక్టరేట్: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి నర్సమ్మ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు 4 రోజులపాటు జరుగనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి కార్మికులు, రైతులు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విజ్ఞానంపైనే భవిష్యత్ ఆధారపడి ఉంటుంది



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: భవిష్యత్ అంతా విజ్ఞానంపైనే ఆధారపడి ఉందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 9 వరకు జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికై న విద్యార్థులను శనివారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక కావడం గర్వకారణమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారతస్థాయి ప్రదర్శనలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఈఓ సుదర్శనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ వెంకట్‌రెడ్డి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

తూప్రాన్: బ్యాంకుల్లో దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయా బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి బ్యాంకులో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అప్పుడే వినియోగదారులకు బ్యాంకుల పట్ల నమ్మకం పెరుగుతుందని వివరించారు. ఏర్పాటు చేసి కనీస వసతులు కల్పించాలని పలువురు కలెక్టర్‌ను కోరారు.

వరం.. అమృత్ జలం

కేంద్రం అమలు చేస్తున్న అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రెజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకంతో నర్సాపూర్ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. మరో 20 ఏళ్ల వరకు రోజు వారి అవసరం మేర నీరు సరఫరా చేసే అవకాశం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిసింది.

నర్సాపూర్

మిషన్ భగీరథ పథకం అమలు చేస్తున్నప్పటికీ నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పైపులైన్ వేయకపోవడంతో నల్లాల ద్వారా తాగు నీరు అందడం లేదు. పట్టణంలో మిషన్ భగీరథ పథకం కింద 18 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న 17 నీటి ట్యాంకులు ఉన్నాయి. కాగా పట్టణ జనాభా సుమారు 25 లక్షల పైనే ఉంటుంది. ఒకరికి మున్సిపాలిటీ నుంచి రోజుకు 135 లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉంటే రోజుకు 24 లక్షల లీటర్ల నీరు కావాల్సి ఉంటుంది. కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్యాంకుల కెపాసిటీ అంత మేరకు లేకపోవడంతో పలు ట్యాంకుల నుంచి డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైపులైన్ ఉన్న పలు ప్రాంతాల ప్రజలకు సరిపడా నీరు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక పట్టణంలోని పలు ప్రాంతాలకు భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా జరగడం లేదు. దీంతో ప్రజలు సొంత బోర్లపైనే ఆధారపడి అవసరాలు తీర్చుకుంటున్నారు.

మరో 20 ఏళ్ల వరకు సమస్య లేకుండా..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకం కింద నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ. 11 కోట్ల 90 లక్షలు మంజూరయ్యాయి. పట్టణంలో రాబోయే 20 ఏళ్ల వరకు నీటి సమస్య తలెత్తకుండా పథకం రూపొందించడంతో పాటు ప్రజలకు రోజు వారి అవసరం మేరకు నీటి సరఫరా చేసే లక్ష్యంతో పథకం అమలు చేయనున్నారు. అమృత్ పథకం కింద వచ్చిన నిధులతో 9వ వార్డులో ఏడున్నర లక్షల లీటర్ల కెపాసిటీ నీటి ట్యాంకుతో పాటు నాల్గవ వార్డులో ఆరున్నర లక్షల లీటర్ల కెపాసిటీ ట్యాంకు నిర్మించాలని నిర్ణయించారు. అంతేగాక మిషన్ భగీరథ పథకానికి సంబంధించి హన్మంతాపూర్ గుట్టపై ఉన్న జీఎల్‌బీఆర్ ట్యాంకు (గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి కొత్తగా నిర్మించనున్న రెండు నీటి ట్యాంకుల వరకు పైపులైను వేసి మిషన్ భగీరథ నీటితో నింపనున్నారు. కాగా పట్టణంలో పైపులైన్ లేని కాలనీలలో సైతం అమృత్ పథకం నిధులతో పైపులైన్ వేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న పైపులైన్ పాడైన చోట కొత్తగా పైపులైన్ వేయనున్నారు. కాగా అమృత్ 2.0 పథకం పనులు ఇప్పటికే టెండరు దశ పూర్తయి అగ్రిమెంట్ స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. అగ్రిమెంట్ అయిన ఏడాది లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారుల ద్వారా తెలిసింది.

త్వరలోనే పనులకు శంకుస్థాపన

అమృత్ 2.0 పథకం కింద నర్సాపూర్ మున్సిపాలిటీకి వచ్చిన నిధులతో చేపట్టే పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే సునీతారెడ్డి ఈనెల 19వ తేదీన శంకుస్థాపన చేయాల్సి ఉండగా, మంత్రి పర్యటన వాయిదా పడింది. కాగా త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది.

అమృత్ 2.0 పథకంలో రూ. 11.90 కోట్ల నిధులు

- ఇప్పటికే పూర్తయిన టెండర్ ప్రక్రియ
- ఏడాదిలోపు పూర్తి కానున్న పనులు
- నర్సాపూర్ మున్సిపాలిటీలో తాగు నీటికి శాశ్వత పరిష్కారం



నర్సాపూర్‌లో మిషన్ భగీరథ నీటి ట్యాంకు

శాశ్వత పరిష్కారం



అమృత్ పథకంతో పట్టణ ప్రజలకు రాబోయే 20 ఏళ్ల వరకు నీటిని అవసరం మేరకు సరఫరా చేసే విధంగా పథకం రూపొందించారు. పథకం వినియోగంలోకి వస్తే పట్టణంలోని అన్ని ప్రాంతాలకు సమంగా నీటి సరఫరా అవుతుంది. పట్టణంలో నీటి సమస్య లేకుండా పోతుంది.

– రామకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్

ఊరంతా ఊట బావులే..

- వ్యవసాయ బావులకు కేరాఫ్ అప్పనపల్లి
- ఇవే ఆ ఊరికి జీవనాధారం
- తరాల నుంచి వీటితోనే పంటల సాగు
- ఎంత కరవొచ్చినా తగ్గని నీళ్లు
- 600 పైగా బావులుంటే.. 20 లోపు మాత్రమే బోర్లు
- ఐదు గజాల లోతుల్లోనే నీటి ఊటలు
- ఇది అప్పన్నపల్లి ‘జల’దృశ్యం



ఊరు చుట్టూ ఎత్తయిన గుట్టలు.. పరిచినట్లు కనిపించే బండరాళ్లు. పక్షుల కిలకిలరావాల మధ్య ఎటుచూసినా పచ్చని పంటలతో ప్రకృతి ఒడిలో ఒదిగినట్లు కనిపించే అందమైన పల్లె. సృష్టికి ప్రతిసృష్టి సృష్టిస్తూ ఎన్నో అద్భుతాలు.. ప్రయోగాలతో దూసుకుపోతున్న ఈ హైటెక్ రోజుల్లోనూ దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో వ్యవసాయ బావులపైనే ఆధారపడుతున్నారు. 5 గజాలు తవ్వితే చాలు నీరు ఉబికి వస్తుంది. ఊరు ఊరంతా ఇదే పరిస్థితి. దీంతో గ్రామంలో బోర్లు వేయడం మానేసి.. పాత రోజుల మాదిరిగానే బావులు తవ్వుతున్నారు. పచ్చని పంటలు సాగు చేస్తున్న రైతన్నకు కల్పవల్లి అయిన అప్పనపల్లి గ్రామంపై ‘సాక్షి’ప్రత్యేక కథనం. 8లో

- దుబ్బాక రూరల్/దుబ్బాక

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్/చేగుంట(తూప్రాన్): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యాబోధన జరగాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు. అలాగే వడియారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు లెక్కలు బోధించా రు. పదోతరగతిలో ఎక్కువ మార్కులు సాధించేందుకు పాటించాల్సిన పద్ధతులు వివరించారు. అనంతరం వంటశాల, తరగతి గదులను పరిశీలించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

మెదక్ కలెక్టరేట్: ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు ఘనంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లబ్ధిదారులకు అందించే విషయంపై సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమగ్ర సమాచారంతో రిపబ్లిక్ డే ఆహ్వాన పత్రికలు తయారు చేయాలన్నారు. శాఖల వారీగా చేపట్టబోయే కార్యక్రమాలపై కార్యాచరణ ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌ఓ భుజంగరావు, ఆర్డీఓ రమాదేవి, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వడియారం ఉన్నత పాఠశాలలో గణితం బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చెట్లు, గుట్టలకు ‘రైతుబంధు’

- గత ప్రభుత్వ హయాంలో డబ్బుల దుర్వినియోగం
- మంత్రి కొండా సురేఖ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): గత ప్రభుత్వం చెట్లు, గుట్టలకు రైతు బంధు ఇచ్చి డబ్బులు దుర్వినియోగం చేసిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. శనివారం వడియారంలో చేగుంట, నార్సింగి మండలాలకు సంబంధించి పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. త్వరలోనే ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభిస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. లోటు బడ్జెట్ ఉన్నా పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. అనంతరం గొల్లపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పడిపోతుందని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని ప్రశ్నించగా.. ప్రజలు బీఆర్‌ఎస్‌ను పడగొడితేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. వందశాతం రుణమాఫీ జరగలేదన్న విషయంలో నిజం లేదని, కొందరికి సాంకేతిక సమస్యలతో కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిపై ప్రజల్లో బీఆర్‌ఎస్ లేనిపోని అనుమానాలు సృష్టిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ నారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదం

వడియారంలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని, హోదాలేని వారిని స్టేజీపై నుంచి పంపించాలని వాదించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని శ్రీనివాస్‌రెడ్డిని వెనుక వరుసలోకి పంపించగా.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. ఇరువర్గాల మధ్య గొడవలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



నినాదాలు చేస్తున్న ఇరుపార్టీల కార్యకర్తలు



బాధితుడికి మొబైల్ అందిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

‘సీఈఐఆర్’ను సద్వినియోగం చేసుకోండి

మెదక్ మున్సిపాలిటీ: సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హవేళీఘణాపూర్ మండలం హవేళీఘణాపూర్ మండలం ఔరంగబాద్‌కు చెందిన పెంటయ్య 2023 జూన్‌లో మొబైల్ పోగొట్టుకున్నాడని, అతడు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇవ్వగా.. ఫోన్ నంబర్‌తో పాటు ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. వారం క్రితం యూపీలో ఫోన్ ఆన్ చేయడం చేయగా.. మొబైల్ దొరికిన వ్యకికి 94 బీఎంఎస్ ప్రకారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి నోటీసులు పంపామన్నారు. అతడు వెంటనే భయపడి కొరియర్ ద్వారా మొబైల్ పంపించాడని చెప్పారు.

వెలగని లైట్లు.. తప్పని పాట్లు




మొబైల్ ఫోన్ టార్చిలైట్ల వెలుగులో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ: అంతిమ సంస్కారాలకు అవస్థలు తప్పడం లేదు. వైకుంఠధామాల్లో కనీస వసతులు కానరావడం లేదు. మెదక్ పట్టణం నవాపేట్ వీధికి చెందిన యువకుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలను నవాపేట్ ఖబరిస్థాన్‌లో రాత్రి నిర్వహించారు. చిమ్మ చీకట్లు అలుముకోవడం.. లైట్లు వెలగకపోవడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేశారు. అయినా పూర్తిస్థాయిలో వెలుగు రాకపోవడంతో మొబైల్ ఫోన్ టార్చిలైట్ల వెలుగులో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇప్పటికైనా స్మశానవాటికల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కనీస వసతులు కల్పించాలని పలువురు కలెక్టర్‌ను కోరారు.

ఎట్టకేలకు కొత్త కార్డులు

- కులగణన ఆధారంగా మంజూరు
- జిల్లాలో 11,515 కుటుంబాల గుర్తింపు
- కొనసాగుతున్న అర్హుల ఎంపిక సర్వే



మెదక్ కలెక్టరేట్: రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారి కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వ పథకాలన్నీ రేషన్ కార్డులతోనే ముడిపడి ఉండడంతో చాలా మంది సబ్సిడీ పథకాలకు దూరమయ్యారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్న నేపథ్యంలో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 21 మండలాలు 493 గ్రామ పంచాయతీలు ఉండగా.. సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని వారిని గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. జిల్లాలో మొత్తం 11,515 మంది కొత్త రేషన్‌కార్డులకు అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. అయితే జాబితాలో పేరులేని అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా? అనే అంశంపై స్పష్టత కొరవడింది. అధికారులు మాత్రం సమగ్ర కుటుంబ సర్వేలో నమోదైన వ్యక్తుల ఆధార్ నంబర్‌ను సరిపోల్చుకుని అర్హులను గుర్తిస్తామని చెబుతున్నారు. కుటుంబాల విభజనతో కొత్త కార్డులు కావాలని దరఖాస్తు చేసిన వారి వివరాలను తాజా సర్వే తర్వాత పాత కార్డుల నుంచి తొలగించనున్నట్లు సమాచారం. కొత్తవారే కాకుండా, మార్పులు, చేర్పుల కోసం కొన్నేళ్లుగా వేలాది మంది ఎదురు చూస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ ప్రాంతంలో నివసించే వారి వార్షిక ఆదాయం రూ. 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాలైతే రూ.1.50 లక్షల వరకు ఉండాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సురేష్‌రెడ్డి చెప్పారు. మాగాణి 3.50 ఎకరాలు లేదా మెట్ట 7.50 ఎకరాలు మించకూడదన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా అర్హులను గుర్తిస్తామని, అభ్యంతరాలు సైతం స్వీకరించి పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఆధార్ సంఖ్యతో డూప్లికేషన్ తొలగిస్తామని, ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో కొనసాగుతుందని వివరించారు.

నేడే మల్లన్న ‘పట్నం వారం’

- బ్రహ్మోత్సవాలకు కొమురవెల్లి సర్వం సిద్ధం
- మహాజాతరకు తరలిరానున్న లక్షలాది మంది భక్తులు



స్వామి వారి మూలవిరాట్టు



స్వామివారి ధూళి దర్శనం చేసుకునేందుకు కానుకలతో తరలివస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం.. బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మొదటి వారాన్ని పట్నం వారంగా పిలుస్తారు. మూడు నెలల పాటు జాతర కొనసాగనుంది. ఈ క్రమంలో మొదటి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలనుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. సోమవారం తోట బావివద్ద నగరానికి చెందిన భక్తులు నిర్వహించే పెద్ద పట్నం, అగ్నిగుండాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మొదలైన భక్తుల రాక

కొమురవెల్లికి భక్తుల రాక మొదలైంది. నేరుగా స్వామివారిని ధూళి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం సుమారు 80 వేల లడ్డూలను తయారు చేశారు.

స్పెషల్ బస్సులు..

మల్లన్న జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులు నడిపిస్తున్నారు. అన్ని రూట్ల నుంచి కొమురవెల్లికి చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి

సిద్దిపేటఅర్బన్: జిల్లా జైలు భవన నిర్మాణ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ పరిధిలో నిర్మిస్తున్న జిల్లా జైలు భవన నిర్మాణ పనులను శనివారం సీపీ అనురాధ, ఇతర సీనియర్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు ఆశించిన రీతిలో జరుగుతున్నాయని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ మురళీ బాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, జైల్ సూపరింటెండెంట్ దశరథం, హౌసింగ్ కార్పొరేషన్ సభ్యులు తులసీదర్ రెడ్డి, సీఈ రాజయ్య, డీఈ సుధాకర్, ఏసీపీ మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(బ్రాహ్మణ బంజేరుపల్లి)కి చెందిన నర్సయ్య(54) కుటుంబ కలహాలతో 15న ఇంట్లో నుంచి బయటకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులుగా చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మల్లంపేట వాసి



తెలుగు సమాజం సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): సీఎం రేవంత్ రెడ్డిని శనివారం పాపన్నపేట మండలం మల్లంపేటకు చెందిన సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు పుల్లన్న గారి శ్రీనివాస్ రెడ్డి కలిశారు. తెలంగాణ రైజింగ్ ప్రధాన ఎజెండాగా సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి త్వరలో జరగనున్న సింగపూర్ తెలుగు సమాజం స్వర్ణోత్సవ (50వ) వేడుకలకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

ఊరంతా ఊట బావులే..

వ్యవసాయ బావులకి కేరాఫ్ అప్పనపల్లి

- బావులే ఈ ఊరికి జీవనాధారం
- 600 పైగా బావులుంటే.. 20 లోపు బోర్లు



దుబ్బాక రూరల్/దుబ్బాక : తరతరాల నుంచి వ్యవసాయమే జీవనాధారంగా వస్తున్న దుబ్బాక మండలం అప్పనపల్లి ఊరిలో వ్యవసాయ బావుల జోరు కనిపిస్తుంది. ఈరోజుల్లో కూడా బోరు బావులు ఎక్కడో ఓ చోట తప్ప పెద్దగా కనబడవు. సహజంగా గ్రామాల్లో 30 ఏళ్ల కిందట వరకు అంతటా చెరువులు, బావులపైనే ఆధారపడి ఎవుసం సాగేది. కాలక్రమేణ బోర్లు రావడంతో గ్రామాల్లో బావులు కనబడకుండా పోయాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా బోర్ల మీదనే ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. అప్పనపల్లిలో మాత్రం బావులతోనే రైతులు పంటలు పండిస్తుండటం విశేషం.


క్రేన్ సహాయంతో తవ్వుతున్న బావులు

బావులతోనే పంటల సాగు

అప్పనపల్లిలో వ్యవసాయమంతా బావులపైననే ఆధారపడి జరుగుతుంది. దీంతో పొలాల వద్ద ఎటు చూసిన బావుల వద్ద క్రేన్‌లు కనిపిస్తుంటాయి. ఎంతటి బీడు భూమైన నీటి వసతి ఉంటేనే భూములు సాగులోకి వస్తాయి. రైతులు నీటి వసతి కోసం విచ్చలవిడిగా బోర్లు వేస్తూనే ఉంటారు. గతంలో రైతులు బావులు వ్యవసాయం చేస్తుండేవారు. క్రేన్ సహాయంతో బావులు తవ్వే కొద్ది సైడ్‌నుంచి నీటి ఊటలు వచ్చేవి. నీళ్ల ఎక్కువ రావడానికి బావుల్లో సైడ్ బోర్లు వేసే వారు. బావి మధ్యలో బోరు మోటార్ పెట్టి పొలాలను సాగు చేసేటోళ్లు. రైతులు తమ పొలాలకు నీటిని సరఫరా చేయాలంటే పొలాల వద్దే తెల్లవారేదాకా ఉండేవారు. ప్రస్తుత కాలంలో బావులు కనుమరుగయ్యాయి. ప్రతీ రైతు తమ వ్యవసాయ భూముల్లో బోర్లు వేసి వాటి ద్వారానే వ్యవసాయం సాగు చేస్తున్నారు. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో ఇప్పటికే బావులను తవ్వి వాటి ద్వారానే వ్యవసాయం చేస్తున్నారు.

600కు పైగా బావులు..

అప్పనపల్లి గ్రామానికి 1,300 ఎకరాలకు పైగా శివారు ఉండగా ఊరు, రోడ్లు పోను 1,100 ఎకరాలు అలాగే పెద్దగుండవెల్లి శివారులో మరో 300 ఎకరాలు మొత్తం 1,400 ఎకరాల వరకు పంటలు సాగవుతాయి. గ్రామంలో ప్రస్తుతం 600 పై చిలుకు బావులుంటే కేవలం 20లోపు మాత్రమే బోర్లు ఉన్నాయి. ఈ సంవత్సరంలోనే కొత్తగా 10 మంది రైతులు బావులు తవ్వి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఇటాచీ, జేసీబీలతో కేవలం నాలుగైదు రోజుల్లోనే పెద్ద పెద్ద బావులు తవ్విస్తారు. కొద్ది లోతు బావి, పూడిక తీతలకు మాత్రం క్రేన్‌లను ఉపయోగిస్తున్నారు.



15 గజాల లోతుల్లోనే నీటి ఊటలు

రైతులు తమ భూముల్లో బావులు తవ్వితే 5 నుంచి 15 గజాల లోతులో నీటి ఊటలు వస్తాయి. మీదనే బండరాయి వచ్చినా ఆ రాయి సొరికల మధ్య నుంచి నీటి ఊటలు పుష్కలంగా వస్తాయి. దీంతో రైతులు ఒక్కో బావి 20 నుంచి 30 గజాల లోతు వరకు తవ్విస్తారు. బావుల్లో ఎక్కువ నీరు రావడానికి లోపల చుట్టుపక్కల సైడ్ బోర్లు వేస్తారు. వ్యవసాయ సాగు కోసం 24 గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో 3 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు వ్యవసాయం సాగు చేస్తారు. వరి పొలంతో పాటుగా కూరగాయలు,వివిధ రకాల పంటలు పండిస్తారు. వేసవి కాలం, వర్షాకాలంలో బావుల ద్వారా వచ్చే నీటి ద్వారానే పొలాలు సాగు చేస్తారు. బావుల్లో నీటి ఊటలు వస్తూనే ఉంటాయి.


బావిలో పుష్కలంగా నీళ్లు

మా గ్రామంలో బావులే ఎక్కువ



మాగ్రామంలో ఎక్కువగా బావులే ఉంటాయి. బావుల ద్వారానే వ్యవసాయం సాగు చేస్తాం. ఇప్పటికి రైతులు తమ భూముల్లో బావులు తవ్విస్తున్నారు. బోర్లు అస్సలే వేయరు. 600 వరకు బావులు ఉండగా, 20 మాత్రమే బోరు బావులు ఉన్నాయి.

– చిర్ర యాదగిరి, రైతు

15 గజాల లోతుల్లో నీరు



మా భూముల్లో బావులు తవ్వితే 5 గజాల నుంచి 15 గజాల లోతుల్లో నీళ్ల వస్తాయి. ఇప్పటికీ క్రేన్ సహాయంతో బావులు తవ్వుతాం. బోర్లు వేయడం అనేది మా ఊరిలో లేదు. ఒక్కో బావి 3 నుంచి 5 ఎకరాల వరకు వ్యవసాయ సాగు కోసం నీరందిస్తుంది. 24 గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో వ్యవసాయానికి సాఫీగా నీరందుతుంది.

– కొంది రాజిరెడ్డి, రైతు

లొద్ది చెరువుతో జీవనాధారం



మా గ్రామ శివారులో లొద్ది చెరువు ఉంది. లొద్ది చెరువు అనేది ఇప్పటి వరకు ఎండిపోయిన చరిత్ర లేదు. చెరువులో ఎప్పటికీ నీళ్ల పుష్కలంగా ఉంటాయి. ఇదే మాకు జీవనాధారం. దీని ద్వారానే బావుల్లోకి నీటి ఊటలు వస్తాయి. బావుల్లో నీరు పై పైకి వచ్చి తమ పంటలు పండుతాయి.

– తిరుపతి, రైతు

భూమి స్వరూపంతోనే..

న్యాచురల్‌గా కొన్ని ప్రాంతాల్లో భూముల స్వరూపంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఒకే చోట ఉంటాయి. ఈ తరహాలోనే అప్పనపల్లిలో బండరాళ్ల ఉన్నప్పటికీ గ్రౌండ్ వాటర్ ఎక్కువగా రీచార్జ్ అవుతుంది. వర్షాలు కురిసినప్పుడు నీరు భూమిలోకి సమృద్ధిగా ఇంకి ఉండి అక్కడి నుంచి భూమి పొర లోపల బండ ఉండడంతో వేరే చోటికి నీరు పోకుండా నిల్వ ఉంటుంది. అప్పనపల్లిలో వాటర్ రీచార్జ్ ఎక్కువ అవుతుండడం ద్వారానే నీటి నిల్వలు పుష్కలంగా ఉండి బావుల్లో నీరు వస్తున్నాయి.

– సీతారాం, జిల్లా భూగర్భ జలాల సమృద్ధి అధికారి


లొద్ది చెరువులో నీరు

కల్ప తరువు.. లొద్ది చెరువు

గ్రామ శివారులో లొద్ది చెరువు ఉండి నీరు ఎప్పటికీ నిల్వ ఉంటుంది. ఎన్ని కరువు కాటకాలు ఏర్పడినప్పటికీ లొద్ది చెరువులో మాత్రం నీరు తగ్గదు. లొద్ది చెరువు ద్వారానే బావుల్లో నీటి ఊటలు వస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు. పూర్వం నుంచి లొద్ది చెరువు ద్వారానే బావుల్లోకి ఊటలు వస్తాయి. చుట్టు ప్రక్క గ్రామాల్లో ఉన్న చెరువులు ఎండి పోయినప్పటికీ ఈ చెరువు మాత్రం ఎండిపోలేదు.

అప్పనపల్లి గ్రామ సమాచారం

కుటుంబాలు	: 500
జనాభా	: 2,200 పైనే
సాగు భూమి	: 1300 ఎకరాలు
బావులు	: 600 పైనే
బోర్లు	: 20 లోపు
పంటలు	: వరి, మొక్కజొన్న, కూరగాయలు,కంది



అప్పనపల్లి గ్రామం బోర్డు

భవన కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలి

- ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలి
- 31 హైద్రాబాద్‌లో టీబీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర స్థాయి మహాసభ
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలువాలని తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం (టీబీఎస్‌ఆర్‌కేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా టీబీఎస్‌ఆర్‌కేఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన ప్రభుత్వ పథకాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన, మరణించిన కార్మికుడి కుటుంబానికి ప్రమాద బీమా పాలసీని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. కార్మికుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని మద్యం బెల్టు షాప్‌లను మూసివేసే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు.31న హైద్రాబాద్‌లోని అంజయ్య కార్మిక భవన్‌లో టీబీఎస్‌ఆర్‌కేఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీబీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి తోట్ల పరుశరాములు, రాష్ట్ర సలహాదారులు నాయిని రామస్వామి, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్మగళ్ల కృష్ణ, కోశాధికారి రామన్న, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్, జనగామ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి

- రాజ్యాంగాన్ని విస్మరిస్తున్న బీజేపీ
- మార్చాలని కుట్రలు చేస్తే గుణపాఠం తప్పదు
- సంవిధాన్ బచావో ర్యాలీలో కాంగ్రెస్ నేత వీహెచ్

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ నాయకులు దేశ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని, బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్న బీజేపీకి గుణపాఠం తప్పదని మాజీ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీ.హనుమంతారావు అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజక వర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సం విధాన్ బచావో పాదయాత్రలో వీహెచ్ పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కృషి చేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. చరిత్ర తెలియని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్‌లో రాహుల్ గాంధీ అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు కృష్ణాగౌడ్, జిల్లా, పట్టణ నాయకులు, మండల నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హనుమంతరావు

డీసీఎంను ఢీకొట్టిన టవేరా వాహనం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు


మేరాజ్ అలీ మృతదేహం

కొండపాక(గజ్వేల్): డీసీఎంను టవేరా వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొండపాక శివారులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. కోదాడకు చెందిన సయ్యద్ మేరాజ్ అలీ (45) సిద్దిపేటలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు సికింద్రాబాద్ జూబ్లీబస్టాండ్‌లో బస్సు కోసం నిల్చున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు న్యూస్ పేపర్లను తీసుకెళ్లే టవేరా వాహనం రాగానే సిద్దిపేట వరకు వెళ్లేందుకు ఎక్కాడు. కొండపాక శివారులోకి రాగానే రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న డీసీం వాహనాన్ని టవేరా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేరాజ్ అలీ మృతి చెందగా, డ్రైవరు రఫీక్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకొని అలీ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరకు లారీ ఢీకొని చిరు వ్యాపారి

నారాయణఖేడ్: చెరకు లారీ ఢీకొని చిరు వ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన ఖేడ్ పట్టణ శివారులోని మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నారాయణఖేడ్ మండలం హంగర్గ (బి) గ్రామానికి చెందిన రఫీక్(42) మోపెడ్‌పై సమోసాలను సరఫరా చేస్తుంటాడు. శుక్రవారం నిజాంపేట ప్రాంతంలో సమోసాలను సరఫరా చేసి తిరిగి నారాయణఖేడ్ వైపు వస్తున్నాడు. మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో చెరకు లోడ్‌తో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రఫీక్‌కు తీవ్ర గాయాలు కాగా నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ఆటో, బైక్ ఢీ : ఏడుగురికి గాయాలు

నారాయణఖేడ్: ఆటో, బైక్ ఢీకొని ఏడుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన అకోలా–నాందేడ్–హైదరాబాద్ 161 జాతీయ రహదారిపై నిజాంపేట్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. నిజాంపేట మండలం కొత్తపల్లికి చెందిన గంగమ్మ(40), భర్త రామయ్య (45), సాయిలు (35), సియోలు(22), సాలమ్మ(35) పెద్దశంకరంపేట నుంచి నిజాంపేట వైపు ఆటోలో వస్తుండగా పెద్దశంకరం పేటకు చెందిన యువకులు బైక్‌పై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా బైక్ ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

దొంగల బీభత్సం

కౌడిపల్లి(నర్సాపూర్): తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కౌడిపల్లి కొత్తకాలనీలో నివాసం ఉండే నాసర్‌ఖాన్ వారం కిందట హైదరాబాద్‌లో బంధువుల పెళ్లికి వెళ్లి శనివారం తెల్లవారుజామున ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 5 తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ. 2లక్షల నగదు చోరీకి గురయ్యాయి. పక్కనే మరో ఇంట్లో తులం 4 గ్రాముల బంగారు కమ్మలు, మాటీలు, 30 తులాల వెండి అభరణాలు చోరీ చేశారు. దీంతోపాటు సమీపంలోని ఆర్‌ఎంపీ ప్రభాకర్ స్కూటీని ఎత్తుకెళ్లారు. చోరీల విషయం తెలియడంతో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ విఠల్ తెలిపారు. ఇదిలా ఉండగా చోరీకి గురైన స్కూటీ తునికి గురుకుల పాఠశాల వెనుకగా అటవీ ప్రాంతంలో దొరకడంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఆలయంలో చోరీ

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని ఎల్లమ్మ గుడిలో శుక్రవారం రాత్రి ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. హుండీ ఎత్తుకెళ్లి సుమారు రూ.20 వేల నగదును అపహరించుకపోయారని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. దుండగుల ఆనవాళ్లు గుడిలో ఉన్న సీసీ పుటేజీలో నమోదయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కంది రైతుకు ఊరట

- జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- క్వింటాల్‌కు రూ.7,550 మద్దతు ధర
- 25 వేల క్వింటాళ్ల దిగుబడి అంచనా

సిద్దిపేటజోన్: జిల్లా వ్యాప్తంగా కంది పంటను సాగు చేసిన రైతులకు ఇది ఊరట లాంటిదే. రైతులకు మద్దతు ధర అందించే ఆలోచనలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు జిల్లా అధికారుల ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రభుత్వం ఆరు మంజూరు చేసింది. ఇందులో ఒక్కటి సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో మంత్రి పొన్నం ప్రభాకర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మిగితా గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక ,తొగుట ప్రాంతాల్లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా మరో వారం రోజుల్లో అందుబాటులోకి తేనున్నారు.


సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో కందులు

రూ.7,550 మద్దతు ధర

ఈయేడు ప్రభుత్వం క్వింటాల్ కందులకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించింది. రెండేళ్లుగా మద్దతు ధర కంటే ప్రైవేటు వ్యాపారులు అధికంగా ధర ఇవ్వడంతో ప్రభుత్వం ఎలాంటి కొనుగోళ్లు చేయలేదు. ప్రస్తుతం జిల్లాలో కంది పంట కోతలు ప్రారంభం కావడంతో నెలాఖరులోగా పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి పంట దిగుమతి వస్తుందనే నేపథ్యంలో ముందస్తుగా జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కంది సాగుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలకు అనుగుణంగా ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

25 వేల క్వింటాళ్ల దిగుబడి అంచనా

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో రైతులు కంది పంట సాగు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ రికార్డుల ప్రకారం ఖరీఫ్ సీజన్‌లో సుమారు 7 వేల ఎకరాల్లో కంది పంట సాగైనట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఈయేడు సుమారు 25 వేల క్వింటాళ్ల వరకు కందులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా రైతులు ఇబ్బంది పడొద్దని కేంద్రాలపై దృష్టి సారించారు.

67.45 శాతం హాజరు

- ప్రశాంతంగా నవోదయ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 4,361 మంది విద్యార్థులు


నారాయణఖేడ్ పరీక్ష కేంద్రంలో నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్

జిల్లా	కేంద్రాలు	హాజరు	గైర్హాజరు
సిద్దిపేట	10	1,665	585
సంగారెడ్డి	12	1,613	1,013
మెదక్	8	1,083	506
మొత్తం	30	4,361	2,104

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 2025–26 విద్యాసంవత్సరంలో వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి 30 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 6,465 మంది విద్యార్థులకు గాను 4,361 మంది పరీక్షకు హాజరైనట్లు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. మొత్తం మీద 67.45 శాతం హాజరైనట్లు వివరించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరిగిందన్నారు. నారాయణఖేడ్ తదితర కేంద్రాలను తాను సందర్శించి పరీక్ష నిర్వహణ పరిశీలించినట్లు పేర్కొన్నారు. సమర్థవంతంగా పరీక్ష నిర్వహణలో సహకారమందించిన ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లకు, విద్యాధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.